సాక్షి శ్రీకాకుళం

సోమవారం, 22, మే, 2023



నాణ్యమైన విద్యకు చిరునామా

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జూన్ 7 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

- 8లో



'గ్రేడ్' మారింది

మహిళా సంఘాలకు మంచి రోజులు వచ్చాయి. డి, సి గ్రేడ్‌ల నుంచి ఏ, బీ గ్రేడ్‌లకు వచ్చాయి.

- 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	37°	27°
ఇచ్ఛాపురం	37°	25°
పాతపట్నం	39°	26°
శ్రీకాకుళం	38°	27°

న్యూస్‌రీల్

నేడు, రేపు అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈఏపీసెట్–2023 (ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ) ప్రవేశ పరీక్షల్లో భాగంగా సోమ, మంగళవారాల్లో అగ్రికల్చర్ బైపీసీ స్ట్రీం, ఫార్మసీ బైపీసీ, ఎంపీసీ స్ట్రీం పరీక్షలు నిర్వహించనున్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో రోజుకు రెండు షిఫ్టుల్లో ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్, చిలకపాలేం శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజ్, టెక్కలి ఐతం కళాశాలల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 15 నుంచి 19 వరకు ఇంజినీరింగ్ పరీక్షలు పూర్తిచేశారు. ఈ పరీక్షలకు జిల్లాలో 5,517 మంది దరఖాస్తు చేసుకోగా, 5,318 మంది హాజరయ్యారు.

'పరమేశ్వరుని అవతారమే ఆదిశంకరాచార్యులు'



గ్రంథావిష్కరణ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పరమేశ్వరుని అపర అవతారమే జగద్గురు ఆదిశంకరాచార్యులని విశ్రాంత తెలుగు ప్రొఫెసర్ వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో ఆదివారం నిర్వహించిన వార్షికోత్సవ సభలో డాక్టర్ సనపల నారాయణమూర్తి వివరణతో ఆదిశంకరాచార్యుల నిర్వాణషట్కమ్ గ్రంథావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకానికి శాంతి విరాజిల్లేలా యదార్థ తత్వాన్ని బోధించేందుకు ఆదిశంకరాచార్యులు దేశమంతా పర్యటించారని తెలిపారు. జగద్గురువు స్వరూపాన్ని ఈ గ్రంథంలో రచయిత చక్కగా ఆవిష్కరించారని అన్నారు. కార్యక్రమంలో నిష్టల నరసింహమూర్తి, పతంజలి శాస్త్రి, మందుల మోహనరావు, డాక్టర్ సంపత్‌కుమార్, ఎన్ఎస్ఎన్ స్వామి, భట్లు, రంగడు ప్రసాదరావు, పీవీఎస్ సాయి ప్రసాద్, భారతి, సరస్వతి, పద్మావతి, నిర్మల, భాస్కరభట్ల శ్రీరామశర్మ, విశ్వనాథం కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటు



కుంటిభద్రలో పిడుగు పడటంతో కాలిపోతున్న కొబ్బరి చెట్టు

కొత్తూరు: మండలంలోని కుంటిభద్రలో ఆదివారం ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలోని కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. పిడుగుపాటుకు చెట్టు కాలిపోయింది. వానతో పాటు ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. అలాగే కొత్తూరులోని దేవర వీధిలో ఓ ఇంటిపై ఆదివారం సాయంత్రం పిడుగు పడింది. పిడుగు ధాటికి ఆ ఇంటిలోని మహిళ స్పృహ కోల్పోయారు. ఇరుగుపొరుగు వారు సపర్యలు చేయడంతో కోలుకున్నారు. ఎలక్ట్రిక్ వస్తువులు పాడైపోయాయి.

అడుగంటిన వంశధార

సరుబుజ్జిలి: క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి నీరు రాకపోవడంతో వంశధార ఎడారిని తలపిస్తోంది. హిరమండలం క్యాచ్‌మెంట్ ఏరియాలో కూడా నీరు తక్కువగా ఉంది. దీంతో తీర ప్రాంతాలైన తెలికిపెంట, పాతపాడు, అగ్రహారం,పెదమాలపేట, యరగాం గ్రామాల్లో నది ఇసుక తిన్నెలతో కనిపిస్తోంది.

ఇంటర్ సప్లిమెంటరీ హాల్ టిక్కెట్ల అందజేత

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన హాల్ టిక్కెట్ల పంపిణీ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు తెలిపారు. ఈ నెల 24 నుంచి మొదలుకానున్న పరీక్షలకు సంబంధించిన విద్యార్థుల హాల్‌టిక్కెట్లు జ్ఞానభూమి వెబ్‌పోర్టల్‌లో కళాశాలల ప్రిన్సిపాళ్ల లాగిన్ నుంచి డౌన్‌లోడ్ చేసి అందజేయాలని కోరారు. మరీ ముఖ్యంగా ప్రైవేటు కళాశాలల్లో ట్యూషన్ ఫీజులతో సంబంధం లేకుండా వంద శాతం పంపిణీ పూర్తికావాలని, హాల్‌టిక్కెట్ తమకు అందలేదనే ఫిర్యాదు వస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మినీ యుద్ధం



- విజయనగరం మినీ మహానాడులో సిక్కోలు రచ్చ
- అశోక్ బంగ్లాలో ఎచ్చెర్ల గొడవ
- కలిశెట్టిని వేదికపైకి ఆహ్వానించడంపై కళా వెంకటరావు మండిపాటు
- అవమానంతో వేదికపైకి వెళ్లని కలిశెట్టి
- అధిష్టానం దృష్టికి వెళ్లిన వివాదం
- బదులిచ్చేందుకు కలిశెట్టి వర్గం ప్లాన్



కళావెంకటరావు



కలిశెట్టి అప్పలనాయుడు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : టీడీపీ నిర్వహిస్తున్న మినీ మహానాడు కార్యక్రమాలు సొంత పార్టీ నేతల తగవులు తీర్చే వేదికలుగా మారుతున్నాయి. మొన్నటికి మొన్న శ్రీకాకుళంలో జరిగిన మినీ మహానాడులో గొండు శంకర్, మామిడి గోవిందరావులను వేదికపైకి ఆహ్వానించకపోవడంతో పార్టీలో ముసలం ఏర్పడగా, శనివారం విజయనగరం అశోక్ బంగ్లాలో జరిగిన మినీ మహానాడులో ఎచ్చెర్ల నాయకుడు కలిశెట్టి అప్పలనాయుడును వేదికపైకి ఆహ్వానించడంతో గొడవ జరిగింది. ఏ అర్హత ఉందని అప్పలనాయుడును సభావేదికపైకి ఆహ్వానిస్తున్నారంటూ ఆ పార్టీ సీనియర్ నేత కిమిడి కళా వెంకటరావు నోటికి పని చెప్పారు. పార్టీ పెద్దల ఎదుటే నోటికొచ్చినట్టు తిట్టి తన నైజాన్ని బయటపెట్టుకున్నారు.

కలిసిరాని మినీ మహానాడు

ఎప్పటి నుంచో చాపకింద నీరులా నడుస్తున్న విభేదాలు మినీ మహానాడు సాక్షిగా బయటపడుతున్నాయి. ఇటీవల శ్రీకాకుళంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన మినీ మహానాడులో శ్రీకాకుళం నియోజకవర్గ టిక్కెట్ ఆశావహుడు గొండు శంకర్, పాతపట్నం నియోజకవర్గ టిక్కెట్ ఆశావహుడు మామిడి గోవిందరావులను ఉద్దేశపూర్వకంగా వేదికపైకి ఆహ్వానించలేదు. అచ్చెన్నాయుడు, అశోక్ గజపతిరాజు, యనమల రామకృష్ణుడు, కూన రవికుమార్ తదితర నేతలు హాజరైన వేదికపైకి గొండు శంకర్, మామిడి గోవిందరావును పిలవలేదు. వాస్తవంగా, ఆ మహానాడు జనసమీకరణ కోసం వీరిద్దరే పెద్ద ఎత్తున కష్టపడ్డారు. బ్యానర్లు ఏర్పాటు చేసిన దగ్గరి నుంచి జనసమీకరణ వరకు పెద్ద ఎత్తున ఖర్చు పెట్టారు. వాహనాలను ఏర్పాటు చేసి ఆయా నియోజకవర్గాల నుంచి అంతో ఇంతో జనాలను తీసుకొచ్చారు. కానీ వారిద్దరినీ వేదికపైకి పిలవకుండా అవమానపరచడంతో వారి వెంట వచ్చిన వారంతా ఆగ్రహంతో ఊగిపోయి వెనక్కి వెళ్లిపోయారు. దీంతో మినీ మహానాడు ప్రాంగణమంతా బోసిపోయింది. ఈ సంఘటన ఆయా నియోజకవర్గాల్లోని టీడీపీ శ్రేణులను సైతం నిరుత్సాహపరిచింది. ఈ రెండు నియోజకవర్గాల్లోనే కాకుండా నరసన్నపేట, పలాస నియోజకవర్గాల్లో కూడా మరో నాయకత్వాన్ని ప్రోత్సహించడంతో అక్కడ కూడా పరిస్థితి దయనీయంగా ఉంది.

తాజాగా ఎచ్చెర్ల వంతు

శ్రీకాకుళం మినీ మహానాడు రేపిన మంటలు చల్లారకుండానే ఎచ్చెర్ల నియోజకవర్గానికి సంబంధించి విజయనగరం వేదికగా చిచ్చు రేగింది. అశోక్ బంగ్లాలో జరిగిన ఆ జిల్లా మినీ మహానాడుకు ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి కళా వెంకటరావు, కలిశెట్టి అప్పలనాయుడు రెండు గ్రూపులుగా ఏర్పడి తమ మందీ మార్బలంతో వెళ్లారు. అక్కడి నేతలకు ఇక్కడ విభేదాలు తెలియకో, శ్రీకాకుళంలో చోటు చేసుకున్న పరిణామాలకు తలెత్తకూడదనో తెలీదు గానీ విజయనగరం టీడీపీ మినీ మహానాడుకు కళా వెంకటరావుతో పాటు కలిశెట్టి అప్పలనాయుడును కూడా వేదికపైకి పిలిచారు. ఈ పరిణామం కళా వెంకటరావుకు చిర్రెత్తించింది. 'ఎవడ్ని పడితే వాడిని వేదికపైకి పిలుస్తారా?' అంటూ నోటికొచ్చినట్టు ఇష్టారీతిన మాట్లాడి రచ్చకు కారణమయ్యారు. అసలే కళా నోరు మంచిది కాదని ఆ పార్టీలో వాదన ఉంది. విజయనగరం వేదికగా జరిగిన మినీ మహానాడులో అదే రుజువైంది. కళా వెంకటరావు అదుపు తప్పి నోటికి పని చెప్పారు. దీంతో ఒక్కసారిగా అక్కడ పరిస్థితులు మారిపోయాయి. కళా వ్యాఖ్యలను కలిశెట్టి అప్పలనాయుడు తట్టుకోలేకపోతున్నారు. ఆ సమయంలో సంయమనం పాటించి వేదికపైకి వెళ్లలేదు. లేదంటే పెద్ద గొడవే జరిగేది. మొత్తానికి ఎచ్చెర్ల టీడీపీ పరువు విజయనగరం వేదికగా మంట గలిసిపోయింది.

కళా కన్నా కలిశెట్టే మిన్న..

వాస్తవంగా కళా వెంకటరావుకు పీడకలలా కలిశెట్టి అప్పలనాయుడు తయారయ్యారు. అడుగడుగునా ఆయన రాజకీయాలకు అడ్డంకిగా మారారు. కళా నాయకత్వానికి ఇబ్బందికరంగా కలిశెట్టి ఎదిగారు. ప్రస్తుతం నియోజకవర్గంలో కళా కంటే కలిశెట్టికే కాస్త పేరు, ఆదరణ ఉంది. కళా వెంకటరావు చేస్తున్న కార్యక్రమాల కంటే కలిశెట్టి నిర్వహిస్తున్న కార్యక్రమాలకే కాసింత జనం వస్తున్నారు. నియోజకవర్గ కేడర్ కూడా కళా కంటే కలిశెట్టినే ఆదరిస్తోంది.

దీంతో మినీ మహానాడు వేదికగా కలిశెట్టి పరువు తీయడానికి కళా పథకం ప్రకారమే ప్లాన్ వేసి ఇలాచేశారని కూడా చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం ఈ వివాదం పార్టీ అధిష్టానం దృష్టికి కూడా వెళ్లింది. నియోజకవర్గంలో రచ్చ రచ్చగా మారింగి. సమయం వచ్చినప్పుడు కళాకు తగిన బుద్ధి చెప్పేలా వ్యవహరించాలని కలిశెట్టి వర్గం ప్లాన్ చేస్తోంది.

జజ్జనకరి జాతర



కాపువీధిలో ఉజ్జిడి బండితో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్లో) నీలమణిదుర్గ అమ్మవారు

- నీలమణి దుర్గమ్మ ఉత్సవాలు ప్రారంభం



ఉజ్జిడి యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ నీలమణిదుర్గ అమ్మవారి మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకు కాపు వీధిలోని నీలమణిదుర్గ ఆలయం నుంచి ఉజ్జిడి బండికి ముందుగా మేళతాళాల నడుమ పూజలు చేశారు. అనంతరం బండిని జూబ్లీ హిల్స్ రోడ్డు మీదుగా ఊరేగించారు. యాత్రలో వేలాది మంది మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఉజ్జిడి బండిలో ప్రతి ఇంటి వారు పులిసిన అన్నం (చద్ది అన్నం), ముర్రాట నీళ్లను వేశారు. యువకులు నృత్యాలతో హోరెత్తించారు. జూబ్లీ హిల్స్ రోడ్డు ప్రభుత్వ ఆస్పత్రి కూడలి వద్ద ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఉజ్జిడి బండిలో పులిసిన అన్నం వేసి అమ్మను దర్శించుకున్నారు. ఊరి శివారున రైల్వే స్టేషన్ వద్ద విద్యుత్ శాఖ కార్యాలయం ఆవరణలో ఉన్న వేపచెట్టు వద్దకు తీసుకువెళ్లి పూజలు చేశారు. అనంతరం దుష్టశక్తులకు పులిసిన అన్నంతో దిష్టి తీశారు. ఉజ్జిడి చెట్టుకు ముర్రాటలు సమర్పించారు. పశువులకు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలు విజయవంతం చేయాలని, గ్రామస్తులందరినీ చల్లగా చూడాలని నమస్కరించి వెనుదిరిగారు. ఈ సందర్భంగా నీలమణి దుర్గ ఆలయంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ముందుగా ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ వాసుదేవరావులు ఎమ్మెల్యేను పూర్ణకుంభంతో ఆలయంలో ఆహ్వానించారు.

ఆదిత్యునికి విశేష పూజలు

- ఒక్కరోజులో రూ.7.75 లక్షల ఆదాయం



సూర్యనమస్కారాల పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



దివ్యాంగుడిని స్వామి దర్శనానికి తీసుకువస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత అరసవల్లి ఆదిత్యుని దర్శనానికి భక్తులు ఆదివారం పోటెత్తారు. మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా ఆలయానికి క్యూ కట్టారు. తొలిజ్యేష్ఠ ఆదివారం సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చి సంప్రదాయ పూజలు చేశారు. భక్తులకు ఎక్కడా ఇబ్బంది రాకుండా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి క్యూలైన్ వద్ద మంచినీటి ప్యాకెట్లను, ఉచిత మజ్జిగను, అలాగే ఆలయ మండపంలో ఉచిత ప్రసాదాలను కూడా అందజేయించారు. అయినప్పటికీ ఒకటి రెండు చోట్ల ఎండకు తాళలేక పలువురు భక్తులు వడదెబ్బకు గురి కాగా.. వెంటనే ఆలయంలో ఉన్న వైద్యారోగ్య శాఖ సిబ్బందితో పాటు ప్రైవేటు ప్రాక్టీషనర్ డాక్టర్ మోహన్ కూడా చికిత్సను అందించారు. అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణతో స్వామి సర్వదర్శనాలకు అనుమతిచ్చారు. అలాగే సాయంత్రం వెండి సప్తాశ్వ రథంలో శ్రీ ఉషా పద్మిని ఛాయాదేవేరులతో శ్రీవారికి తిరువీధి నిర్వహించారు. ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, ఎస్.కోటేశ్వర చౌదరి తదితరులు భక్తులకు ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ప్రత్యేకంగా స్వామిని దర్శించుకున్నారు. ఆదివారం ఒక్కరోజులో విశిష్ట, ప్రత్యేక దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.4,72,300, విరాళాలు, ఆర్జిత పూజల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.50,486, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.53 లక్షలు మొత్తంగా రూ.7,75,786 ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పుట్టినరోజు సందర్భంగా ఆలయ పాలకమండలి సభ్యుడు మండవిల్లి రవి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆదిత్యునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీచ్‌ల పరిరక్షణ అందరి బాధ్యత



పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



బీచ్‌లో చెత్తను ఏరుతున్న దృశ్యం

గార: బీచ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతని శ్రీకాకుళం నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ ఓబులేసు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం–2023 పురస్కరించుకొని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ఎస్ఈ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం కె.మత్స్యలేశం బీచ్‌లో ఉదయం జిల్లాలోని వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, ఉద్యోగులు, స్థానిక ప్రజలు, విద్యార్థులు బీచ్ క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ మనం నిత్యం చేసే పనులు పర్యావరణానికి మేలు చేయాలన్నారు. భవిష్యత్ తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించాలన్నారు. సముద్ర తీర ప్రాంతాలను పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్టుగా తెలిపారు.

భూమిలో కలిసిపోయే వస్తువులను వినియోగించుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి.లలిత ఎర్రన్న, జిల్లా పర్యాటక శాఖాధికారి ఎన్.నారాయణరావు, జిల్లా పౌరసంబంధాల అధికారి కె.బాలమాన్‌సింగ్, మంత్రి వెంకటస్వామి, తహసీల్దార్ జెన్ని రామారావు, బుద్దా స్కూల్ విద్యార్థులు, యువటూరిజం క్లబ్ సభ్యులు, నటుకుల మోహన్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

వలలకు రిపేర్లు

ఇచ్ఛాపురం రూరల్: వేట నిషేధ కాలంలో మత్స్యకారులు వలలకు రిపేర్లు చేసుకుంటున్నారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు రెండు నెలలు పాటు వేట నిషేధ సమయంలో మత్స్యకారులు తమ వేటకు అవసరమైన వలలు, నాటు పడవలు మరమ్మతు చేసే పనిలో పడ్డారు. 10 నెలల పాటు మత్స్యకారులు సముద్రంలో వేట సాగించే సమయంలో పెద్ద పెద్ద చేపలు వలల్లో చిక్కుకోవడం, రాళ్లు, రప్పలు, బోట్ల చెక్కలు వలల్లో చిక్కుకుపోవడంతో అవి పాడైపోతుంటాయి. అదే విధంగా సముద్రంలో ఉండే పెద్దపెద్ద రాళ్లకు తగలడం, వేట సమయంలో బోల్తాపడిన బోట్లు మరమ్మతుకు గురి కావడంతో వాటిని రిపేరు చేసే పనిలో నిమగ్నమయ్యారు.



పాడైపోయిన వలల్ని కుడుతున్న డొంకూరు మత్స్యకారులు

కొత్త టీచర్లకు సరికొత్తగా శిక్షణ



శ్రీకాకుళం న్యూకాలనీ,గార: జిల్లాలోని డీఎస్సీ 1998, 2008, 2018 బ్యాచ్ ఉపాధ్యాయులకు వృత్త్యంతర శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా రెండో విడత శిక్షణ సోమవారం నుంచి మొదలుకానుంది. జిల్లాలో వమ్మరవల్లి డైట్, కాశీబుగ్గ జెడ్పీహెచ్ స్కూల్, పాలకొండ తమ్మినాయుడు విద్యా సంస్థలు.. ఈ మూడు కేంద్రాలుగా తొలివిడత శిక్షణ మొదలైన విషయం తెలిసిందే. అవే కేంద్రాలుగా ఈనెల 22 నుంచి ఐదు రోజులపాటు రెండో విడత శిక్షణ మొదకానుంది.

బోధనలో మెలకువలతోపాటు..

ఐదు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో బోధనలో మెలకువలు, నైపుణ్యాభివృద్ధి, పిల్లల అభ్యసనంలో అభివృద్ధి సాధించడం కోసం ఉపాధ్యాయులు తీసుకోవాల్సిన చర్యలు, బహుళ తరగతి బోధన, మూల్యాంకనం వంటి పలు అంశాలపై అవగాహనను పెంపొందించేలా శిక్షణ అందజేస్తారు. నిర్దేశించిన కేంద్రంలో జరిగే శిక్షణకు ఉపాధ్యాయులు విధిగా హాజరుకావాల్సిందేనని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య స్పష్టం చేస్తున్నారు.

పేదల అభివృద్ధి కోసమే తాపత్రయం



ధర్మానకు కేక్ తినిపిస్తున్న దృశ్యం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన సాహసం ఏ ప్రభుత్వమూ చేయలేదు
- పుట్టిన రోజు వేడుకల్లో మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): గత ప్రభుత్వాలు బీదలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తే.. వైఎస్సార్ సీపీ మాత్రం పేదల అభివృద్ధి కోసమే పరితపిస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. గత పాలకులంతా ధనవంతుల అభివృద్ధి కోసమే పాటు పడ్డారని, వైఎస్ జగన్ సర్కారు పేదలకు ప్రాధాన్యత ఇస్తే తప్పేముందని అన్నారు. శ్రీకాకుళంలో టౌన్‌హాల్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంత్రి ధర్మాన జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేశారు. ముందుగా అసెంబ్లీలో ధర్మాన ప్రసంగాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. తర్వాత కర్ణాటక సిస్టర్స్ అపూర్వ, అనాహిత కర్ణాటక సంగీత విభావరి నిర్వహించారు. అనంతరం మంత్రి ధర్మాన మాట్లాడారు.

తాను అధికారంలో ఉన్నా లేకున్నా అభిమానుల ఆదరణ వెలకట్టలేనిదని అన్నారు. ఉన్నతమైన వ్యక్తుల భావజాలాన్ని తాను పాటిస్తానని, మాజీ ఎమ్మెల్యే కేఏస్ భుక్త గురించి వివరించారు. అన్ని వనరులు ఉన్నా జిల్లా వెనుకబడిపోవడానికి గత పాలకుల నిర్లక్ష్యమే కారణమన్నారు. జిల్లాలో జరిగిన అభివృద్ధి పనులన్నీ వైఎస్సార్, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లనేనని చెప్పారు. తాను ఆర్అండ్‌బీ మంత్రిగా ఉన్నప్పుడు రూ.వెయ్యి కోట్లతో జిల్లాలో 10 బ్రిడ్జిలను నిర్మించామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శ్రీకాకుళం జిల్లా అంటే ప్రత్యేక అభిమానం కాబట్టే మూలపేట పోర్టు నిర్మాణం, బుడగట్లపాలెం ఫిషింగ్‌హార్బర్, వంశధార లిఫ్ట్‌ఇరిగేషన్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారని చెప్పారు. ఇవి పూర్తయితే వలసలు ఆగిపోతాయని ఆకాంక్షించారు.

సీఎం జగన్ బటన్ నొక్కుతూ డబ్బులు వృథాగా పంచుతున్నారని కొంతమంది హేళన చేయడం సరికాదన్నారు. 80 ఏళ్లుగా ప్రజల అవసరాలు తీర్చే ప్రభుత్వాలు ఎందుకు రాలేదు ? పేదల అభివృద్ధి కోసం రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలు ఎందుకు గత ప్రభుత్వాలు అమలు చేయలేదో చెప్పాలన్నారు. బడుగు బలహీన వర్గాలకు చేయూత అందించేందుకే జగన్ ఈ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. విశాల భావజాలంతో ఆదేశిక సూత్రాలు అమలు చేస్తున్నామని చెప్పారు. తానెక్కడ పోటీ చేసినా జిల్లా ప్రజలు అండగా, తోడుగా ఉన్నారు కాబట్టే ఈ స్థాయిలో ఉండగలిగానని అన్నారు. మేధావులతో మాట్లాడిన తర్వాతే అసెంబ్లీ ప్రసంగాలు చేసేవాడినని, అందులో నుంచే ఈ రోజు బుక్ తీసుకు వచ్చామన్నారు. ఆది రానున్న తరాలకు దిక్సూచిగా ఉంటుందని తెలిపారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, తూర్పు కాపు, కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్లు మామిడి శ్రీకాంత్, అంధవరపు సూరిబాబు, ఎంపీ పద్మావతి, వైవీ సూర్యనారాయణ, చల్ల సుగుణ, దానేటి శ్రీధర్, పొన్నాడ రుషి, గొండు కృష్ణ, ఎం.వి స్వరూప్, పైడి రాజారావు, కోణార్క్ శ్రీను, మండవల్లి రవి, అంబటి శ్రీను, భాస్కర్‌రావు, పైడి మహేశ్వరరావు, గురుగుబెల్లి లోకనాథం, శ్రీకాకుళం నగరం, రూరల్, గార నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో ఢీకొని వృద్ధునికి తీవ్రగాయాలు



తీవ్రగాయాలపాలైన మల్లయ్య

టెక్కలి రూరల్: మండలంలోని లచ్చన్నపేట జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అయోధ్యపురం గ్రామానికి చెందిన ఎం.మల్లయ్య అనే వృద్ధునికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మల్లయ్య ఆదివారం ఉదయం తన సైకిల్ మీద టెక్కలి వైపు వస్తుండగా అదేమార్గంలో వచ్చిన లగేజీ ఆటో ఢీకొట్టింది. దీంతో మల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై టెక్కలి ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



అదుపు తప్పి బోల్తా పడిన వ్యాన్

టెక్కలి రూరల్: మండలంలోని లచ్చన్నపేట గ్రామ సమీప జాతీయ రహదారిపై ఆదివారం వేకువజామున మామిడి కాయల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒడిశా రాష్ట్రం గంజామ్ జిల్లా రఘుల్ మెట్ట గ్రామానికి చెందిన డ్రైవర్ భగవాన్ సాయి తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

టైరు పేలి.. అదుపు తప్పి



రోడ్డు ప్రమాదంలో నుజ్జయిన కంటైనర్ లారీ ముందు భాగం

కోటబొమ్మాళి: మండలంలోని జర్జంగి వద్ద జాతీయ రహదారిపై ఆదివారం కంటైనర్ లారీ అదుపు తప్పి మరో లారీని ఢీకొట్టింది. ఘటనలో ఒడిశాకు చెందిన లారీ డ్రైవర్ ప్రదీప్‌కుమార్ ప్రధాన్ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా నుంచి చేపల లోడుతో విశాఖపట్నం వెళ్తున్న కంటైనర్ లారీ జర్జంగి వద్దకు వచ్చే సరికి టైరు పేలడంతో అదుపు తప్పి జాతీయ రహదారిపై నున్న మరో లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో లారీ ముందు భాగం ధ్వంసమవ్వగా లారీ డ్రైవర్ కుడికాలు విరిగిపోయింది. క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో కోటబొమ్మాళి ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడి నుంచి విశాఖ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,420–00
బంగారం(22సి. 10గ్రా.)	56,300–00
వెండి (కిలో)	79,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 495.00
విజయనగరం	రూ. 499.00
శ్రీకాకుళం	రూ. 499.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

నాణ్యమైన విద్యకు చిరునామా

- ఏపీ మోడల్ స్కూల్/కాలేజీల్లో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల
- నేటి నుంచి మే 7 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- కార్పొరేట్‌ను తలదన్నే విధంగా మోడల్ కాలేజీల్లో ఇంటర్ విద్యా బోధన
- ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో గణనీయమైన ఉత్తీర్ణత సాధింపు



జి.సిగడాం ఏపీ మోడల్ స్కూల్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలు కార్పొరేట్ తలదన్నేలా అత్యుత్తమ విద్యకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. ఫలితాల్లోనూ మెరుగైన ప్రతిభ కనబరుస్తున్నాయి. ప్రస్తుతం ఏపీ మోడల్ స్కూల్/కాలేజీల్లో ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించింది. జిల్లాల పునర్విభజన తర్వాత 30 మండలాలతో కూడిన శ్రీకాకుళం జిల్లాలో మొత్తం 13 మోడల్ స్కూళ్లు/కాలేజీలు ఉన్నాయి. ఇంటర్మీడియెట్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులను అందిస్తున్నారు. ఒక్కో కోర్సుకు గరిష్టంగా 40 సీట్లు భర్తీ చేస్తారు. ఈ లెక్కన ఒక మోడల్ కాలేజీలో 160 సీట్లు భర్తీ చేయనున్నారు. దీంతో జిల్లాలో 13 మోడల్ కాలేజీల్లో కలిపి మొత్తం 2080 సీట్లు నింపనున్నారు. ప్రస్తుతం జిల్లాలో 971 మంది ఇంటర్మీడియెట్ చదువుతున్నారు. తాజాగా వెలువడిన టెన్త్ ఫలితాల్లోను మోడల్ స్కూళ్లు 94.40 శాతం ఉత్తీర్ణత సాధించి శభాష్ అనిపించాయి. 1249 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 1179 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ఇంటర్మీడియెట్‌లో కూడా మంచి ఫలితాలను సాధించి సత్తా చాటాయి.

22 నుంచి దరఖాస్తుల స్వీకరణ..

2023–24 విద్యా సంవత్సరానికిగాను మోడల్ స్కూళ్లలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ వెలువరించింది. ఈ నెల 22వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే ప్రక్రియ మొదలుకానుంది. ఏపీఎంఎస్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులు చేసుకునేందుకు జూన్ 7వ తేదీతో గడువు ముగియనుంది.

నిరుపేదలకు వరం..

పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు కూడా ఉన్నత చదువులను అందుబాటులోకి తీసుకుని రావడమే ధ్యేయంగా ఏపీ మోడల్ స్కూళ్లు ఏర్పాటయ్యాయి. ఉచితంగా ఇంగ్లిష్ మీడియంలో బోధన అందించే మోడల్ స్కూల్ కాలేజీలు విద్యార్థులకు వరంగా మారాయి. నీట్, జేఈఈ, ఏపీఈఏపీసెట్ (పాతఎంసెట్) లాంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, స్పోకెన్ ఇంగ్లిష్, చేతి రాతపై ప్రత్యేక శ్రద్ధ, అన్ని సౌకర్యాలతో కూడిన గ్రంథాలయం, ఆధునిక పరికరాలతో కూడిన సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, ఎల్సీడీ ప్రాజెక్టర్ విద్యా బోధన, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, ఇతర మౌలిక సదుపాయాలను అందిస్తున్నారు.



తామాడ ఏపీమోడల్ కాలేజీలో ఏపీఈఏపీసెట్ (పాతఎంసెట్) పరీక్షలకు సిద్ధం చేస్తున్న పీజీటీ

అర్హతలు/దరఖాస్తు ఫీజు/ ఎంపిక ఇలా..

- జిల్లాలోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.
- దరఖాస్తు చేసుకునే ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు దరఖాస్తు ఫీజుగా ఆన్‌లైన్‌లో రూ.200 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు ఫీజుగా రూ.150 చెల్లించాలి.
- పదో తరగతి పరీక్షలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రతిపాదికగా సీట్లను కేటాయిస్తారు.
- ఎంపికైన విద్యార్థులకు రూపాయి ఖర్చు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యను అందజేయనుంది.
- సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ లేదా ఏపీఎంఎస్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి..



గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ఏపీ మోడల్ స్కూల్/కాలేజీలను తీసుకొచ్చారు. ప్రస్తుతం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చేశాయి. అద్భుతమైన వసతులు, సౌకర్యాలతో తొణికిసలాడుతున్నాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం 9, 10, ఇంటర్ చదువుతున్న బాలికలకు వసతి అందిస్తుంది. బాలురుకు కూడా వసతి కల్పించేందుకు ఆలోచన చేస్తుంది. ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. దరఖాస్తుకు జూన్ 7 వరకు గడువు ఉంది.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, డీఈఓ, శ్రీకాకుళం

మందస ఉత్సవాల్లో జానపద పోటీలు



మాట్లాడుతున్న ఉత్సవాల కమిటీ నాయకులు

మందస: మేజరు పంచాయతీ మందసలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న శ్రీఅన్నపూర్ణమ్మ తల్లి గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా జిల్లాస్థాయి జానపద పోటీలు నిర్వహించనున్నారు. మహేంద్ర కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ గిన్ని అప్పలస్వామిరెడ్డి జ్ఞాపకార్థం ఈ నెల 29, 30వ తేదీల్లో జానప కెరటాలు అనే కార్యక్రమాలను జరుపుతున్నట్టు మహేంద్ర కళామండలి, స్పందన సాహితీ, సంస్కృతి వేదిక, గ్రామదేవత ఉత్సవాల కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని కళింగ వైశ్య సంఘం భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనడానికి 9440321034, 9000331343 అనే నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ చెరుకుపల్లి యల్లమ్మ, లక్ష్మణమూర్తి, గిన్ని తిరుపతిరెడ్డి, వీవీ రమణమూర్తి, మాజీ సర్పంచ్ డుంకురు తిరుపతి, తెలుకుల గణేష్, వడ్డి గోపాలకృష్ణ, ఆర్.దిలీప్‌కుమార్, ఇప్పిలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రథయాత్రకు షెడ్యూల్ ఖరారు

- జూన్ 4న పూరీ జగన్నాథుని దేవస్నాన పూర్ణిమ
- 20న ఘోషయాత్రకు ముహూర్తం నిర్ణయించిన నియోగుల సంఘం

భువనేశ్వర్: ఈ ఏడాది జూన్ 4న పూరీ జగన్నాథునికి దేవస్నాన పూర్ణిమ, 20న ప్రపంచ ప్రసిద్ధ రథయాత్ర జరగనుంది. ఈ నేపథ్యంలో ఛత్తీష్ నియోగుల సమావేశంలో ప్రధాన ఉత్సవాల షెడ్యూల్ ఖరారు చేశారు. ఘోషయాత్ర లేదా గుండిచాయాత్ర రోజు శ్రీమందిరం ప్రధాన ఆలయం రత్నవేదిక నుంచి చతుర్ధామూర్తుల తరలింపు(పాహొండి) ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 12:30 గంటలతో ముగించి మదన్మోహన్ విజే, అలంకరణ తదితర అనుబంధ కార్యక్రమాలు చేపడతారు. సాయంత్రం 4 గంటలకు రథాలు లాగడం ప్రారంభిస్తారు. దేవస్నాన పూర్ణిమ రోజు ఉదయం 9.30 నుంచి 11.30 మధ్య జలవిజే, పూజ, స్నానం కార్యక్రమాలు చేపట్టి మధ్యాహ్నం 12.45 గంటల నుంచి హత్తీ బేష్(గజానన అలంకరణ) ప్రారంభిస్తారు. నీలాద్రి భక్తి నివాస్ సమావేశ హాలులో శ్రీమందిరం ప్రధాన పాలన అధికారి(సీఏఓ) రంజన్‌కుమార్ దాస్ అధ్యక్షతన ఆదివారం జరిగిన ఛత్తీష్ నియోగుల సమావేశంలో సమావేశంలో పూరీ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ కె.విశాల్‌సింగ్, కలెక్టర్ ఇన్‌చార్జి ప్రదీప్‌కుమార్ సాహు, శ్రీమందిరం పాలకమండలి సభ్యులు, ఛత్తీష్ నియోగుల సంఘం అధ్యక్షుడు, కార్యదర్శి, సీనియర్ సేవాయత్‌లు పాల్గొన్నారు.

ప్రధాన ఉత్సవాల తేదీలివే..

తేదీ	ఉత్సవం
మే 30	రాజేంద్రాభిషేకం
మే 31	రుక్మిణీహరన్ ఏకాదశి
జూన్ 1	చంపక ద్వాదశి
జూన్ 2	దైతపతుల ప్రవేశం
జూన్ 3	సేనా పట్టా అమరిక
జూన్ 13	చొక్కా విజే
జూన్ 14	ఖొళ్లీ లగ్గి(విస్తరి సేవ)
జూన్ 15	రాజ్‌ప్రసాద్ విజే
జూన్ 16	ఘునా లగ్గి
జూన్ 17, 18	బొనాకొ లగ్గి
జూన్ 19	నేత్రోత్సవం, నవయవ్వన దర్శనం
జూన్ 24	హీరా పంచమి
జూన్ 25	రథాల దక్షిణ మలుపు
జూన్ 27	సంధ్యా దర్శనం
జూన్ 28	బహుడా యాత్ర (మారు రథ యాత్ర)
జూన్ 29	స్వర్ణ అలంకరణ
జూన్ 30	ఒధొరొ పాణా
జులై 1	నీలాద్రి విజే


ఎయిడ్స్‌తో మరణించిన వారికి నివాళి



ఎయిడ్స్ బాధిత మృతులకు నివాళులర్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో ఆదివారం ఎయిడ్స్ బాధిత మృతులకు నివాళులర్పించే కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అగ్గున మేఘన, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీ శంకర్‌ల ఆధ్వర్యంలో వైద్యులు, నర్సులు, వివిధ విభాగాలకు చెందిన సిబ్బందితో కలిసి కొవ్వొత్తులను పట్టుకుని నివాళులర్పించారు.

కబడ్డీ పోటీల్లో సిక్కోలు సత్తా



తృతీయ స్థానం దక్కించుకున్న శ్రీకాకుళం జట్టు

విజయనగరం: రాష్ట్ర స్థాయి అండర్–19 స్కూల్ గేమ్స్ బాల, బాలికల కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం జట్టు ప్రతిభ చూపింది. విజయనగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో రెండు రోజుల పాటు జరిగిన కబడ్డీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. పోటీల్లో బాలుర విభాగంలో కృష్ణా జిల్లా జట్టు ద్వితీయ స్థానం, శ్రీకాకుళం జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో కృష్ణా జట్టు ప్రథమ స్థానంలో నిలవగా... ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం జట్టు, తృతీయ స్థానంలో ఆతిథ్య విజయనగరం జట్టు నిలిచాయి. విజేత జట్లకు విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్‌కౌశిక్ తదితరులు బహుమతులు ప్రదానం చేశారు.

అపూర్వ సాయం



కిడ్నీవ్యాధికి గురైన స్నేహితులను దత్తత తీసుకున్న పూర్వ విద్యార్థులు, పూర్వ ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: పాఠశాల పూర్వ విద్యార్థులు చాలాకాలం తర్వాత కలుసుకోవడం, ఆటపాటలతో పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడం అందరూ చూసేదే. కానీ బొడ్డపాడు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2003 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఓ అపూర్వ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వీరు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులకు సత్కరించారు. ఆ తర్వాత తమ స్నేహితులైన మద్దిల అర్జున్, బైనపల్లి గీతలు ఇద్దరూ కిడ్నీ వ్యాధులకు గురికావడంతో వారికి తక్షణ సాయం కింద రూ.10 వేల చొప్పున అందజేసి, ఎప్పుడు ఎలాంటి సాయం కావాలన్నా చేస్తామంటూ దత్తత తీసుకున్నారు. వీరిని ఉపాధ్యాయులు మెచ్చుకున్నారు.

వివాహిత ఆత్మహత్య

పోలాకి: మండలంలోని పిరువాడ గ్రామానికి చెందిన ఉర్జాన ఢిల్లీశ్వరి అనే వివాహిత ఆదివారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కోటబొమ్మాళి మండలం సంతనేరడివలస గ్రామానికి చెందిన ఢిల్లీశ్వరి, పిరువాడకు చెందిన ఎన్ని రమేష్‌లు ప్రేమించుకుని పెద్దలు ఒప్పుకున్నాక ఏడాదిన్నర కిందట పెళ్లి చేసుకున్నారు. వీరికి నాలుగు నెలల పాప కూడా ఉంది. రమేష్ సీలింగ్ పనులు చేస్తుంటారు. ప్రేమ వివాహం కావడంతో కట్నకానుకల ప్రస్తావన రాలేదు. కానీ పెళ్లయ్యాక రమేష్ నిత్యం కట్నం కోసం వేధించేవాడు. చెడు అలవాట్లు కూడా ఉండడంతో ఢిల్లీశ్వరి తన బంధువుల వద్ద అనేక మార్లు తన బాధలు చెప్పుకుంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నర్సింహమూర్తి కేసు నమోదు చేశారు. డీఎస్పీ బాలచంద్రారెడ్డి పిరువాడ చేరుకుని దర్యాప్తు అనంతరం మృతదేహాన్ని నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.

రైలు కింద పడి టీచర్ దుర్మరణం



రైలు కింద పడి మృతి చెందిన బొంగు భరత్

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం నరసన్నపేట మండలం తామరాపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బొంగు భరత్(39) రైలు కింద పడి మృతి చెందారు. ఆయన ప్రస్తుతం కోటబొమ్మాళి మండలం తాటిపర్తి గ్రామంలో టీచర్‌గా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాకుళంలో నివాసం ఉంటున్నారు. మృతునికి భార్య భావని, కుమారులు దీక్షిత్, చేతన్‌శౌర్య ఉన్నారు. భరత్ మృతితో స్వగ్రామం తామరాపల్లిలో విషాద ఛాయలు నెలకొన్నాయి. పలాస జీఆర్పీ ఎస్‌ఐ షరీఫ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రి గేటు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ వి.సందీప్ కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మతిస్థిమితం లేని సుమారు 38 ఏళ్ల వ్యక్తి మూడు నెలలుగా నగరంలోనే భిక్షాటన చేస్తూ తిరిగేవాడు. ఒడియా భాష మాట్లాడేవాడు. కాలికి సెప్టిక్ కావడంతో స్థానికులు 15 రోజుల కిందట రిమ్స్‌లో చేర్పించారు. అయితే అతను వైద్యం చేయించుకోకుండా బయట తిరిగేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం డీహైడ్రేషన్‌కు గురై మృతి చెందినట్లు రిమ్స్ సెక్యూరిటీ ఇన్‌చార్జి ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి



రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సత్యవతి, నాయకులు

శ్రీకాకుళం అర్బన్: శాస్త్ర, సాంకేతిక, టెక్నాలజీ రంగాన్ని భారతదేశానికి పరిచయం చేసిన వ్యక్తి రాజీవ్ గాంధీ అని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం శ్రీకాకుళంలోని ఇందిరావిజ్ఞానభవన్‌లో డీసీసీ అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి, కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ గొప్పదనాన్ని వివరించారు. ఇటీవల కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవి చేపట్టిన సిద్ధరామయ్యకు, డీకే శివకుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు

ఒక్క సబ్జెక్టు డిగ్రీ కోర్సుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ఎచ్చెర్ల క్యాంపస్: నూతన విద్యా విధానం అమలు, ఉన్నత విద్యా మండలి సూచనల మేరకు ఈ విద్యా సంవత్సరం నుంచి ఒక్క సబ్జెక్టు డిగ్రీ మూడేళ్ల కోర్సులు ప్రారంభించనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వర్సిటీలో ఆదివారం వివరాలు వెల్లడించారు. ఎంపిక చేసిన కళాశాలల్లో ఈ కోర్సు నిర్వహణ ఉంటుందని చెప్పారు. మూడేళ్ల డిగ్రీలో ఆరు సెమిస్టర్లతో 21 పేపర్లు ఒక్క ప్రత్యేక సబ్జెక్టువి ఉంటాయని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో విద్యావిభాగంలో 21 పేపర్లతో కూడిన మూడేళ్ల డిగ్రీ ప్రారంభంపై కసరత్తు చేస్తున్నట్లు వివరించారు. బీఏ ఎడ్యుకేషన్‌గా కోర్సు నిర్వహిస్తామని అన్నారు. 2019–20 బ్యాచ్‌కు నాలుగేళ్ల డిగ్రీ కోర్సులో భాగంగా ఎంపిక చేసిన సబ్జెక్టులో కొన్ని కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తామని, ఈ విద్యార్థులు పీజీలో నేరుగా రెండో ఏడాది ప్రవేశాలు పొందే వెసులుబాటు ఉంటుందని చెప్పారు. ఈ ఏడాది నుంచి నూతన విద్యా విధానంలో భాగంగా వర్సిటీలో బీఏ ప్లస్ బీఎడ్, బీఎస్సీ ప్లస్ బీఎడ్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఉపాధి లక్ష్యంతో డిగ్రీ కోర్సుల్లో మార్పులు చేస్తున్నట్లు వివరించారు.

‘గ్రేడ్’ మారింది

- మహిళా సంఘాలకు మంచి రోజులు
- సీ, డీ గ్రేడ్‌ల నుంచి ఏ, బీ గ్రేడ్‌లకు వచ్చిన సంఘాలు
- కొత్తగా వేలల్లో సంఘాలు ఏర్పాటు
- భారీగా తగ్గిన డిఫాల్టర్ గ్రూప్‌లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహిళా సంఘాలకు మంచి రోజులు వచ్చాయి. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక మహిళలకు ఆర్థిక స్వావలంబన పెరిగింది. రుణ భారాన్ని ప్రభుత్వం మోయడంతో పాటు, సున్నావడ్డీ రాయితీ వంటివి కల్పించి మహిళా స్వయం శక్తి సంఘాలకు పెద్ద పీట వేశారు. మహిళా మార్టులు ఏర్పాటు చేసి, వారిలో వ్యాపార సామర్థ్యాలను వెలికి తీస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మహిళా సంఘాలకు ఆసరా పేరిట రుణమాఫీ చేస్తున్నారు. 2014 ఎన్నికల్లో మహిళా సంఘాలకు రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చిన చంద్రబాబు సభ్యులకు రూ.10వేలు ఇచ్చి మమ అనిపించారు. దీంతో రుణభారం తీరక మహిళా సంఘాలు కుదేలయ్యాయి. 2019 నాటికి చాలా సంఘాలు డిఫాల్టర్లుగా మారాయి. ఇవన్నీ సీ, డీ గ్రేడ్‌లుగా ముద్ర పడ్డాయి. ఆనాటి పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ పరిస్థితి గమనించారు. అప్పుడు ఇచ్చిన మాట ప్రకారం విడతల వారీగా రుణమాఫీని ఆసరా పేరిట అందించారు. ఇప్పటికే మూడు విడతలు అందజేశారు. దీంతో సంఘాలకు ఆర్థిక పరిపుష్టి పెరిగింది. ఆసరా పథకంలో భాగంగా ఇప్పటివరకు జిల్లాలో మూడు విడతల్లో 42,326 మహిళా సంఘాలకు గాను రూ.928.29 కోట్లు సభ్యులకు అందజేశారు. ఇంకా ఒక విడత 2024 జనవరిలో అందజేయనున్నారు. 2019 నాటికి జిల్లాలో 47,347 మహిళా స్వయం శక్తి సంఘాలు ఉండగా, వీటిని గ్రేడింగ్ చేయగా, అప్పటికి ‘ఏ’ గ్రేడ్ 24.38 శాతం సంఘాలు ఉన్నాయి. నేడు ‘ఏ’ గ్రేడ్‌లో 48.71 శాతం సంఘాలు ఉన్నాయి. అంటే చాలా సంఘాల గ్రేడ్ పెరిగింది. అలాగే కొత్తగా 1510 సంఘాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఏర్పాటయ్యాయి. డిఫాల్టర్ గ్రూపులు కూడా తగ్గాయి. అప్పటిలో ఆగిపోయిన గ్రూప్‌లు మళ్లీ కార్యకలాపాలు ప్రారంభించాయి.

సంఘాలు బలోపేతమయ్యాయి

గతం కంటే ప్రస్తుతం జిల్లాలో మహిళా స్వయం శక్తి సంఘాలు బలోపేతమయ్యాయి. డీ గ్రేడ్‌లు తగ్గాయి. కొత్త సంఘాలు ఏర్పడ్డాయి. వీరి ఆధ్వర్యంలో మహిళా మార్టులు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే స్వయం ఉపాధితో పలువురు చిరు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగారు.

– డాక్టర్ విద్యాసాగర్, డీఆర్‌డీఏ పీడీ, శ్రీకాకుళం